8వ పాఠం ఆగష్టు 14-20

# విశ్రమించుటకు స్వేచ్ఛ ఇవ్వబడెను

సబ్బాతు మధ్యాహ్నము ఆగష్టు 14

**ఈ వారమునకు చదువ వలసిన వచనములు : మార్కు 2:1-12; 1రాజులు 18; 19:1-8; కీర్త 34:18; మత్తయి 5:1-3; కీర్త 73:26.**

**కంఠతవచనం : "యెహోవా నాకు వెలుగును రక్షణయునైయున్నాడు. నేను ఎవరికి భయపడుదును? యెహోవా నా ప్రాణ దుర్గము. ఎవరికి వెరతును" (కీర్తనలు 27:1).**

యేసు భూమి మీద సేవ చేసినప్పుడు అనేకమంది రోగులను మరియు మరణించే స్థితిలో ఉన్న వారిని కలుసుకున్నాడు. బాధ నుండి విశ్రాంతి పొందుటకు, రోగాల నుండి స్వస్థత పొందుటకు జన సమూహములు యేసు నొద్దకు వచ్చేవారు. అన్నివేళల యేసు వారిని స్వస్థపరచి వారికి విశ్రాంతినిచ్చేవాడు.

కొన్నిసార్లు ఎవరినైనా పూర్తిగా స్వస్థపర్చుటకు యేసు కేవలం కొన్ని మాటలు మాత్రమే పలికేవాడు. ఎవరైనా ఒక రోగిని యేసుముట్టుకొనగా ఆ క్షణములోనే అతడు లేక ఆమె స్వస్థత పొందేవారు. కొన్ని సమయాలలో యేసు రోగిని పంపించి వేసేవాడు. అప్పుడా వ్యక్తి మార్గమధ్యములో స్వస్థపడేవాడు. యేసు పురుషులను స్త్రీలను చిన్న పిల్లలను, యూదులను, యూదేతరులను ధనికులను స్వస్థపర్చాడు. ఎవరి సంరక్షణలో లేని పేద వారిని కూడా బాగు చేసాడు. ఎంతటి ఘోరమైన వ్యాధి లేక సమస్య యేసుకు సాటియైనదేదీ లేదు. పుట్టుకతోనే గుడ్డి వారిని స్వస్థపర్చెను. కుష్ఠ రోగులను బాగు చేసెను. వారు చర్మవ్యాధితో బాధపడుతూ ఉండగా యేసు కాలములో అనారోగ్యవంతులకు దూరముగా జీవించేవారు. ఏదైనా పట్టణములోనికి ప్రవేశించినచో "మేము అపవిత్రులము అపవిత్రులము" అని కేకలు పెట్టి దూరముగా ఉండమని ప్రజలను హెచ్చరించేవారు. ఆ దినములలో కుష్టు రోగముకన్నా ఘోరమైన రోగము మరణము. యేసు మృతులను కూడా లేపాడు.

ఈ వారము రెండు విధాలైన స్వస్థతను గూర్చి అధ్యయనము చేయబోవుచున్నాము. 1. ఒక వ్యక్తి తనంతట తాను యేసు నొద్దకు రాలేని రోగము గలవాడు. 2.ఒకడు ఆరోగ్యవంతుడుగానే కనబడును గాని అతనికి కూడా స్వస్థత అవసరమైయున్నది. స్వస్థత కొరకు మనము చేసిన ప్రార్థనలను దేవుడు మన మూహించిన రీతిలో జవాబివ్వని యెడల ఏమి సంభవిస్తుందనే ప్రశ్నను కూడా మనము అడుగవచ్చును. పరిస్థితులు ఆ విధముగా ఉన్నపుడు విశ్రాంతిని ఏవిధముగా కనుగొనగలము?

ఆదివారం ఆగష్టు 15

## స్వస్థపర్చే విశ్రాంతి (మార్కు 2:1-4)

మనము అనారోగ్యముగా ఉన్నపుడు విశ్రాంతి అవసరము. పరిపూర్ణముగా స్వస్థపరచబడునట్లు మన దేహములకు విశ్రాంతి కావాలి.

తరచుగా మనస్సులకు కూడా విశ్రాంతినివ్వాలి. కొన్నిసార్లు జీవితము ప్రమాదములో పడకుండా జబ్బు పడుదురు. జలుబు, తలనొప్పి రావచ్చు. అట్టి సమయాలలో రోజూ ఆలోచిస్తున్న అన్ని విషయాలు ప్రక్కన పెట్టి పడకల మీద విశ్రాంతి తీసుకుంటూ ఉంటాము.

కొన్నిసార్లు మన జీవితమును ప్రమాదములో పెట్టగలిగే స్థితిలో జబ్బు పడుతూ ఉంటాము. మంచం మీద పరుండి వైద్యులు నిర్వహించే వైద్య పరీక్షలను గూర్చి ఆలోచిస్తాము. నాకెందుకీ విధంగా జరుగుతుందనే రీతిలో కొంత ఆశ్చర్యానికి గురవుతూ ఉంటాము. మన చెడు అలవాట్లగూర్చి అనారోగ్యకరమైన జీవనశైలిని బట్టి బాధపడుచున్నామా? 20 సం॥ క్రితము సేవించిన మత్తు పదార్ధాల గురించా ఇప్పుడు జబ్బు పడుతున్నాము. అధిక బరువును మన దేహముల మీద పెట్టినందుకా లేక ఎవరికి తెలియని రహస్య పాపమును చేయుచున్నందుకు దేవుడు శిక్షిస్తున్నాడా?

**మార్కు 2:1-4 చదువుడి. ఈ వాక్యాలలో ఏమి జరుగుచున్నదని చూపాయి?**

ఒక వృత్తాంతములో పేర్కొనబడిన ఒక మనిషికి చేతులు, కాళ్ళు కదలవు. ఆ విషయాన్ని యుగయుగాల ఆకాంక్ష, పుటలు 267-271లో చదువుతున్నాము. ఆ మనిషి తన గత జీవితములో సిగ్గుపడే కార్యాలను చేసాడు. అతని పాపములు అతని రోగమునకు కారణమైనది. వైద్యులు అతనిని నయము చేయలేరు.

నేడు మనకు జరుగుచున్న కొన్ని చెడ్డ విషయాలను బట్టి మన గతమును నిందించుకుంటాము. అయితే మనల్ని మనం నిందించుకున్నా లేక ఇతరులను నిందించినా అది మనలను స్వస్థపర్చదు లేక మనలను పరిపూర్ణులుగా చేయదు.

మన జీవితాల కొరకు దేవుని యొక్క ప్రణాళికలో బాధ, వ్యాధి లేక శోధనలు అనేవి లేవు. ఆరోగ్య సూత్రాలను అనుసరించమని అనుగ్రహించాడు. ఆరోగ్య సూత్రాలు పాటించినచో జీవితాలు ఆరోగ్యవంతముగానే ఉంటాయి. మనకు జబ్బు చేసిన లేక ఆరోగ్యముగా ఉన్నా, దేవుడు విశ్రాంతినిస్తానని వాగ్దానము చేసాడు. అదొక శుభవార్తయై ఉంది. జబ్బుకు మనమే కారణమైనను, ఆయన మనకు విశ్రాంతి నిస్తానంటున్నాడు. చిన్న పిల్లలముగా ఉన్నపుడు తల్లిదండ్రులు మనలను జాగ్రత్తగా సంరక్షించకపోయినను దేవుడు విశ్రాంతిని అనుగ్రహించాడు. విశ్రాంతి ఏ విధముగా ఇవ్వాలో దేవునికి తెలుసు.

ఎవరైనా జబ్బు పడినపుడు దానికి కారణమని ఎవరిని లేకదేనిని నిందించవద్దు. అయితే ఆరోగ్యవంతులుగా ఉండాలనుకున్నపుడు అనారోగ్యమునకు గల కారణములను అర్ధము చేసుకొనుట ద్వారా లభించే ఉపయోగమేమిటి?

**సోమవారం** **ఆగష్టు 16**

## రోగ కారణమునకు వైద్యము చేయుట (మార్కు 2:5-12)

కాళ్ళు చేతులు కదపలేని ఒక మనిషికి నలుగురు స్నేహితులున్నారు. ఈ నలుగురు స్నేహితులు యేసు దర్శించిన గృహము యొక్క కప్పు విప్పి సందు చేసి పక్షవాయువుగల ఆ మనుష్యుని యేసు పాదముల చెంత దింపిరి. ఈ ఘోర పాపిని యేసు స్వస్థపరుస్తాడా? రోగము తనను విడిచి పొమ్మని ఆయన చెప్పునా?

**ఆ మనిషిని ఏవిధముగా యేసు స్వస్థపర్చెను? అతనికి యేసు చేసిన మొదటి విషయమేమిటి? మార్కు 2:5–12 చదువుడి.**

మన దేహములు రోగము యొక్క లక్షణాలను చూపించే వరకు మనము జబ్బుగా ఉన్నామని సాధారణముగా ఒప్పుకోము. అనేకసార్లు ఆరోగ్య లక్షణాలే అసలైన రోగమని ఆ లక్షణాలకు వైద్యము చేయించుకుంటాము. స్వస్థత పొందుదుము. యేసు వ్యాధిని వేరే కోణములో చూసేవాడు. జబ్బులన్నింటికి నిజమైన కారణము ఆయనకు తెలుసు. అందువలన యేసు ఎప్పుడు జబ్బు ఏ కారణము చేత కలిగెనో ఆ కారణానికి ముందుగా వైద్యము చేసేవాడు. ఆ కారణాలను అప్పటికప్పుడు స్వస్థపర్చేవాడు కాదు. ముందుగా రోగి యొక్క హృదయాన్ని స్వస్థపర్చేవాడు. మనుష్యుని అపరాధ భావము చాలా లోతుగా ఉంటుంది. అపరాధ భావము అతనిని కృంగదీస్తుంది. తాను రోగముతో బాధపడుట కన్నా, ఇంకా ఎక్కువగా తన అపరాధము వలన దేవునికి దూరమైపోయాననే భావము అతనిని కృంగతీస్తుంది. అయితే మనిషి దేవుని మీద ఆధారపడినప్పుడు ఎంత బాధనైనను, వేదననైనను భరిస్తుంది. అందుచేత రోగము యొక్క మూలము యొద్దకు వెళ్ళి ఆ మనిషికి ముందుగా పాప క్షమాపణ అనుగ్రహిస్తాడు.

పక్షవాయువుగల ఆ రోగి యొక్క పాపములను ముందుగా యేసు క్షమించినపుడు మత నాయకులు ఆశ్చర్యము చెందారు. దేవుడొక్కడే పాపములను క్షమించువాడు. యేసు తనను గూర్చి ఏమనుకుంటున్నాడు? వారి హృదయములో చెలరేగుచున్న కోపముతో కూడిన ప్రశ్నలను గ్రహించాడు. జవాబుగా యేసు వారినొక ప్రశ్న అడిగాడు.

**మార్కు 2:8,9 చదవండి. మత నాయకులను యేసు అడిగిన ప్రశ్న ఏమిటి? వారి హృదయములో ఉన్న నిజమైన సమస్యను వారు గుర్తించునట్లు చేయుటకు యేసు ఏమి చేసెను?**

క్షమాపణను మనము చూడలేము. కాని సిలువపై చూసినపుడు క్షమాపణ పొందుటకు ఎంత వెల చెల్లించాలో కనిపిస్తుంది. క్షమాపణ ఒక వరముగా మనుష్యులకిచ్చుటకు దేవుడు తన కుమారుని ప్రాణమును చెల్లించాడు.

మన అంతరంగమును ముందుగా స్వస్థపర్చాలని దేవుడు కోరుచున్నాడు. అప్పుడు మన దేహమును స్వస్థపర్చును.

**దేవుని యొద్ద నుండి కోరుకున్నట్లు స్వస్థత ప్రార్ధనకు జవాబు దొరకనప్పుడు ఏవిధముగా విశ్రాంతిని, సమాధానమును కనుగొనగలము?**

మంగళవారం ఆగష్టు 17

**పారిపోవుట (1రాజులు 18)**

ప్రపంచ వ్యాప్తముగా నంబరు వన్ జబ్బు ఏమిటో మీకు తెలుసా? విచారముతో నిండిన హృదయము. మనస్సు విచారపడుట పాపము కాదు. విచార హృదయము గల మనిషి అనగా ఆ వ్యక్తికి దేవునియందు నమ్మకము లేదని అర్ధము కాదు.

కొన్నిసార్లు విచారముగా ఉండుట అనే లక్షణము నెమ్మదిగా ఏర్పడుతుంది. ఏదైన ఘోరమైన విషయము చోటు చేసుకున్నపుడు త్వరగా విచారములోనికి జారుకుందుము. కర్మెలు పర్వతము మీద ఎదురైన అనుభవము తరువాత ఏలియాకు సంభవించినది అదే. మన జీవితములలో ఏదైనా ఒక పెద్ద సంఘటన సంభవించినపుడు, త్వరగా అలసిపోయి కృంగిపోయిన పరిస్థితులు ఏర్పడినపుడు ఏలియా యొక్క జీవితము గుర్తుకువస్తుంది.

**1రాజులు 18లో ఏలియా పెద్ద అద్భుత కార్యమును చూసాడు. దేవుడు పరలోకము నుండి అగ్నిని పంపాడు. 3 సంవత్సరాలు వర్షములు కురవలేదు. ఏలియా ప్రార్ధించాడు దేవుడు తన ప్రార్ధనను ఆలకించి వర్షమును పంపెను. యెజెబెలు ఏలియాను చంపుటకు పథకం వేసింది. ఎన్నో అద్భుత కార్యాలు చూచిన ఏలియా ఆమె నుండి ఎందుకు తప్పించుకొని పారిపోయాడు? (1రాజులు 19:1-5 చదువుడి).**

ఏలియాకు గడిచిన 24 గంటలు చాలా కష్టమైన అలసిపోయిన సమయము. కష్టముతో కూడిన అనుభవము, యెజెబెలు నుండి పొంచి ఉన్న ప్రాణ హాని వలన ఏలియా చాలా విచారముగా ఉన్నాడు. 850 మంది బయలు ప్రవక్తలను చంపి వేయడాన్ని కూడా

ఏలియా చూసాడు (1రాజు 18:40) తానే స్వయముగా కొంత మంది బయలు ప్రవక్తలను చంపియుంటాడు.

ఇన్ని అనుభవాలు ఎదురైనప్పటికి ఏలియా పారిపోతున్నాడు. కొన్నిసార్లు మనము కూడా ఏలియా వలె ప్రవర్తిస్తూ ఉంటాము. పరిస్థితులు బాగుగా లేనపుడు అక్కడ నుండి వెళ్ళిపోవడానికి ప్రయత్నిస్తుంటాము. క్రొత్త ఉద్యోగము కొరకు ప్రయత్నిస్తాము. క్రొత్త స్నేహితుల కొరకు వెదుకుదుము. ఇవన్నియూ మన వద్ద నుండి విశ్రాంతిని దొంగిలిస్తాయి. చివరికి ఇవన్నీ నిజమైన సమస్యను దాచిపెట్టును. అవి సమస్యను పరిష్కరించవు. అయితే సమస్య నుండి పారిపోవాలని చూస్తే, సమస్య ఇంకా జటిలమవుతుంది.

**బుధవారం** **ఆగష్టు 18**

## పారిపోవుటకు కూడా అలసిపోయాడు (1రాజులు 19:4)

ఏలియా చాలా అలసిపోవుట వలన ముందుకు పరుగెత్త లేదు. అందుచేత అతడు ప్రార్థించెను. కర్మెలు పర్వతము మీద చేసిన ప్రార్థనకు ఈ ప్రార్థన వేరుగా ఉన్నది (1రాజు 18:36,37). ఈ ప్రార్థన సాధారణమైనది. క్లుప్తముగా ఉన్నది మరియు నిరీక్షణలేనట్టి ప్రార్థనయైయుంది.

**1రాజు 19:4లో ఏలియా మాట్లాడుతూ గతములో తన కుటుంబ సభ్యుల కన్నా ఇపుడు తన పరిస్థితి ఏమాత్రము మెరుగ్గా లేదని చెప్పెను. అతడేమి మాట్లాడుచున్నాడు?**

ఏలియా పరుగు పెట్టడం మాని, అతడు తప్పు చేస్తున్నట్లు భావించాడు. అతడు పారిపోవుట వలన మంచి కొరకు మార్పు చెందుటకు ఇశ్రాయేలుకు ఒక అవకాశమును కోల్పోవుచున్నదని గుర్తించాడు. ఏ ప్రజలకైతే అతడు అవసరమైయున్నాడో వారికి ఏలియా సమయానికి తోడ్పడకుండా ముంచి వేసాడు. ఆ విషయమై అతడు ఏమీ చేయలేని స్థితిలోకి దిగజారిపోయాడు. అతడు యదార్థముగా ఏమైయున్నాడో తనకు తానే చూసుకోగలిగాడు.

ఏలియా ఎదుర్కొనిన పరిస్థితుల వంటివి మన జీవితములో కూడా అందరికి ఎదురవుతూ ఉంటాయి. నీవు నిజముగా ఏమైయున్నావో దానిని నీయంతట నీవే చూచుకోగలుగుట అనునది చాలా బాధాకరమైన అనుభవము. అందుచేత ఫిలిప్పి 3:9లో ఇవ్వబడిన బైబిలు వాగ్దానము నిమిత్తమై మనము వందనస్తులమై ఉండాలి. యేసునందున్న మన విశ్వాసము దేవునితో మనలను సమాధానపర్చును. యేసునందున్నచో దేవుడు మనలను యేసును చూసినట్లు చూస్తాడు. మనకు ఎల్లపుడు అవసరమైన నిరీక్షణ ఈ వాగ్దానము మనకు అనుగ్రహిస్తుంది.

అదే సమయములో జీవితము శ్రమతో కూడుకున్నదనే విషయాన్ని మనము ఒప్పుకొని తీరాలి. విచారముతో నిండిన హృదయము మనలను మనమే ద్వేషించుకొనే విధంగా చేస్తుంది. కొన్ని సమయాలలో మరణము తప్ప మరొకమార్గము లేదనే విధంగా ఆలోచిస్తాము.

ఏలియా ఆవిధముగా భావించాడు. అతడు ఎదుర్కొనిన సమస్యలు బహు భారముతో కూడుకున్నవి. అతడు వాటిని తన హృదయముతో మోసుకొని పోవుట సాధ్యమయ్యే పని కాదు. అందుచే "యెహోవా నా పితరులకంటే నేను ఎక్కువ వాడను కాను. ఇంత మట్టుకు చాలును నా ప్రాణము తీసుకొనుము" (1రాజులు 19:4) అని ప్రార్ధించెను.

"అయితే ఏలియా యెడల దేవునికి కోపము రాకుండుట శుభవార్త. మన హృదయాలలో ఉన్న విచార భావాలకు వ్యతిరేకముగా పోరాడుచున్నపుడు ఆ స్థితిని మనకన్నా దేవుడు బాగా అర్థము చేసుకుంటాడు. యేసు మీవైపు ప్రేమతో చూస్తున్నట్లు ఒకవేళ ఇప్పుడు మీ యొద్ద రుజువేమీ లేకపోవచ్చు. కాని ఆయన చూస్తున్నాడు. ఆయన స్పర్శను తెలుసుకోలేకపోవచ్చును కాని ఆయన హస్తము మిమ్ములను ప్రేమతోను దయతోను తట్టుచున్నది" -ఎలెన్ జి వైట్, క్రీస్తు యొద్దకు మెట్లు, పుట 97.

**1రాజు 19:7; కీర్త 34:18; మత్త 5:1-3; కీర్త 73:26; యెష 53:4,6 చదువుడి.**

గురువారం ఆగష్టు 19

### విశ్రాంతి మరియు అంతకన్నా ఎక్కువ (1రాజులు 19:5-8)

ఏలియా పరుగెత్తుచుండగా అలసిపోయాడని దేవునికి తెలుసు. ఏలియా హృదయానికి విశ్రాంతి అవసరమని దేవునికి తెలుసు. అపరాధ భావమనే గొప్ప భారమును ఏలియా మోస్తున్నాడు. ఏలియాను దేవుడు క్షమించి అతనికి విశ్రాంతిని అనుగ్రహించెను. చివరికి ఏలియా విశ్రాంతి తీసుకొని నిద్రపోయి అలసట తీర్చుకున్నాడు.

అంతటితో అతని వృత్తాంతము ముగియలేదు. దేవుడు మనకు అనుగ్రహించే విశ్రాంతి కేవలం దేహము అలసట తీర్చు కొనుటకే కాదు. అంతకుమించి అందులో ఇమిడియున్నది. ఆ విశ్రాంతి మన హృదయాలను స్వస్థపర్చును. ఈ స్వస్థతను దేవుడు వేగవంతము చేయడు.

**ఇపుడు ఏలియా ఎక్కడికి వెళ్ళుచున్నాడు? (1రాజు 19:58 చదువుడి).**

ఏలియా విశ్రాంతిని పొందిన తరువాత ఏమి చేసాడు? మరలా పరుగిడుట ప్రారంభించాడు. ఏలియా ఎక్కడికి వెళ్ళుచున్నాడో అది దేవుని పర్యవేక్షణలో ఉన్నది. మనము పాపము నిండిన భూమిపై జీవిస్తున్నామని దేవునికి తెలుసు. అందుచే మన జీవితము విచారముతో నిండియుండవచ్చు. మన సమస్యలన్నిటి నుండి పారిపోయే విధముగా విచారముతో నిండిన హృదయము నడిపిస్తున్నది. అయితే సరియైన దిశగా పరుగెత్తునట్లు

దేవుడు సహాయము చేస్తాడు. మన మాయన చెంతకు పరుగెట్టవలెనని కోరుచున్నాడు. అలా చేసినపుడు "మిక్కిలి నిమ్మళముగా మాటలాడు ఒక స్వరమునకు" (1రాజులు 19:12) విధేయత చూపించే విధముగా ఆయన బోధిస్తాడు. ఆ స్వరము మన హృదయముతో మాట్లాడే స్వరమైయున్నది. దేవుని స్వరమునకు విధేయత చూపించినప్పుడు విశ్రాంతిని కనుగొనగలము.

ఏలియా బదరీ వృక్షము క్రింద కూర్చొని తాను చనిపోవాలని కోరుకున్నాడు. తన జీవితములో మంచిరోజులు గతించిపోయినట్లు భావించాడు. దేవుని కలుసుకొనుటకు నడిచి వెళ్ళే శక్తి లేదు. అందుచేత దేవుడు ఏలియాకు అవసరమైన శక్తిని అనుగ్రహించాడు. అదే శక్తి మనకు కూడా దేవుడు ఇవ్వగలడు.

**ఏలియా కొరకు దేవుడు ఆశ్చర్యపరచే ఏ విషయాన్ని సిద్ధము చేసాడు? (1రాజులు 19:15,16; 1రాజులు 2:11 చదువుడి).**

ఏలియా కొరకు మంచిరోజులు ముందున్నాయని దేవునికి తెలుసు. ఏలియా కొరకు స్వస్థత వస్తుంది. దేవుని నియమాలు అనుసరించి జీవించిన యెడల ఏలియాకు స్వస్థత లభిస్తుంది. దేవుని కొరకు ఏలియా ఈ భూమి మీద చేయవలసిన పని ఇంకా కొంత మిగిలియున్నది. మరొకసారి ఏలియా పరలోకమునుండి అగ్నిని పంపమని వేడుకుంటాడు (2రాజు 1:10), బదరీ వృక్షము క్రింద ఏలియా నిరీక్షణ లేనివానిగా మరణించబోడు, అగ్నితో చేయబడిన ఒక యుద్ధ రథముపై ఏలియా ప్రయాణము చేయును, ఎగురుచున్న అగ్ని రథముపై పరలోకమునకు కొనిపోబడును. అక్కడ నిరంతరము విశ్రాంతిని అనుభవిస్తాడు అని దేవునికి తెలుసు.

**పరిస్థితులు నీకు అనుకూలముగా లేకపోయినను, ఏలియావలె దేవునియందు నీవెట్లు విశ్రాంతిని పొందుదువు? ఎట్టి పరిస్థితిలోను నిరీక్షణను పోగొట్టుకొనకూడదని ఈ వృత్తాంతము నీకేమి బోధిస్తుంది?**

**శుక్రవారం** **ఆగష్టు 20**

## అదనపు అధ్యయనము

"జీవితము ఎల్లప్పుడు మార్పు చెందుతూనే ఉంటుంది. ఈ మార్పులు మనలను సంతోష పెట్టును లేక విచారపర్చును. మన యెడల దేవునికున్న ప్రణాళికలను మాత్రము అవి మార్చలేవు. దేవుడు మార్పు చెందేవాడు కాడు. ఆయన నేడు, నిన్న ఒకేలా వున్నవాడు. రేపు కూడా అదే విధముగా ఉంటాడు. ఆయన ప్రేమయందు మనము పరిపూర్ణమైన

నమ్మకమును కలిగి యుండాలి. ఆయనను ఎన్నడు అవమానించకూడదు" –ఎలెన్ జి వైట్, పరలోకపు స్థలములలో పుట 120.

"నిరంతరము యేసువైపు చూడుడి. మీ హృదయములో నుండి నిశ్శబ్ద ప్రార్థనలను చేయుడి. ఆయన శక్తిమీద ఆధారపడుడి. మీ ప్రార్థనలు ఆయన ఆలకిస్తున్నాడనే రుజువు మీకు లేకపోవచ్చును. అయినప్పటికి మీ ప్రార్థనతో ముందుకుసాగిపోండి. మీరు చేసే ప్రతి ప్రార్థన దేవుని సింహాసనమునకు చేరుతున్నదనియు ప్రతి ప్రార్థనకు దేవుడు జవాబిస్తున్నాడని నమ్మండి. ఆయన వాగ్దానములు ఎన్నడు మోసము చేయవు. మీ హృదయములో ఆయనకు స్తుతి యాగములు చేయండి. అప్పుడు సంతోషము మనదగును" –ఎలెన్ జి వైట్, ఎన్నిక చేయబడిన వర్తమానములు, పుస్తకము 2, పుటలు 242, 243.

## చర్చించుకొనుటకు ప్రశ్నలు

1. హృదయములోను, మనస్సులోను, విచారముగా ఉన్న వారిని ఏవిధముగా ఓదార్చాలో అనేక సందర్భాలలో మనకు తెలియదు. ఇట్టి వ్యాధితో బాధపడుచున్న వారికి మీ ప్రాంతీయ సంఘము ఏమి చేయగలదు?
2. దేవునితో ఎల్లప్పుడు నమ్మకముగా ఉండాలని ప్రయత్నం చేస్తూ ఉంటాము కీర్తనలు వ్రాసిన గ్రంథకర్తలు వారి భావములను దేవునితో ఏవిధముగా పంచుకున్నారో గమనించండి. ఇట్టి నమ్మకత్వమును దేవునితోను మరియు ప్రాంతీయ సంఘ సభ్యులతోనుండుటకు మనమేమి చేయాలి?
3. మనము విచారముగా ఉన్నపుడు ప్రార్థన చేయుట కష్టమనిపిస్తుంది. వారంతట వారు ప్రార్థించలేని వారితో ప్రార్థన యొక్క అవసరతను గూర్చి చర్చించండి.
4. విశ్వాసము అనునది ఒక భావము కాదని మనము ఎందుకు గుర్తుంచుకోవాలి? కష్ట సమయాలలో దేవునికి ప్రార్థించుట ఎంత ముఖ్యమో ఎట్లు తెలుసుకొనగలము?
5. మన జీవిత శైలిని బట్టి కొన్ని వ్యాధుల బారిన మనము పడుదుము. మార్కు 2లో ఉన్న వృత్తాంతము ఎట్టి నిరీక్షణను కలిగిస్తుంది?

❖❖❖